www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం ఆదివారం 02.02.2025



## సామాన్యుల బడ్జెట్: ప్రధాని మోదీ

2025–26 బడ్జెట్ సామాన్యుల బడ్జెట్ అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శనివారం ఉదయం బడ్జెట్ సమర్పణకు ముందు ఉదయం నిర్వహించిన కేబినెట్ భేటీలో బడ్జెట్ కు ఆమోదం లభించిన అనంతరం తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ జ్ఞాన బడ్జెట్ అన్నారు. మహిళలు, రైతులు, యువకులు, నిరుపేదలు, సామాన్యుల ఆర్థికాభివృద్ధికి, ఆకాంక్షలకు అనుగుణంగా ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

# రూ.12,00,000 వరకు నో ట్యాక్స్!

ఏడాదికి రూ. 80 వేల వరకు మిగులుబాటు

2లో



- రైతుల కోసం 'ధన్ ధాన్య కృషి యోజన'..
- కిసాన్ క్రెడిట్ కార్డు లోన్లు రూ. 5 లక్షలకు పెంపు
- మూడేండ్లలో ప్రతి జిల్లా హాస్పిటల్‌లో డే కేర్ క్యాన్సర్ సెంటర్
- ఎడ్యుకేషన్‌లోకి ఏఐ.. బొమ్మల తయారీకి ప్రత్యేక స్కీమ్
- 2028 నాటికి అందరికీ రక్షిత మంచినీళ్లు..రక్షణ రంగానికి దండిగా పైసలు
- లోక్‌సభలో 2025–26 కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నిర్మల
- మొత్తం బడ్జెట్ రూ. 50 లక్షల 65 వేల 345 కోట్లు



## ఎమ్మెల్యేల భేటీపై సీఎం ఆరా!

- నగర శివారులో పది మంది ఎమ్మెల్యేల రహస్య భేటీ
- మంత్రివర్గంతో సీఎం రేవంత్ రెడ్డి అత్యవసర సమావేశం
- అధికారులు రావొద్దని ముఖ్యమంత్రి ఆదేశాలు

3లో

## నిరూపిస్తేనే నమ్మేది

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో సుప్రీం సంచలన వ్యాఖ్యలు
- కులం పేరుతో దూషణను నిరూపిస్తేనే చర్యలు


3లో

కలంజ్యోతి
ఆదివారం 02.02.2025

| బడ్జెట్ సమగ్ర స్వరూపం | (రూ. కోట్లలో) |
|---|---|
| మొత్తం బడ్జెట్ | 50,65,345 |
| రెవెన్యూ వసూళ్లు | 34,20,409 |
| మూలధన వసూళ్లు | 16,44,936 |

# రూ.12,00,000 వరకు నో ట్యాక్స్!

**కలంజ్యోతి ప్రతినిధి:**
మధ్యతరగతి ప్రజలపై పన్నుల భారాన్ని తగ్గించేలా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కీలక మార్పులు చేసింది. ముఖ్యంగా ఉద్యోగులకు రిలీఫ్ ఇచ్చింది. సామాన్యులు (ఇండివిజ్యువల్ ట్యాక్స్ పేయర్స్) ఇక నుంచి రూ.12 లక్షల ఆదాయం వరకు ఇన్‌కమ్ ట్యాక్స్ కట్టాల్సిన అవసరం లేదు. ఉద్యోగులకు స్టాండర్డ్ డిడక్షన్ కింద ఇస్తున్న రూ.75 వేలు కూడా కలుపుకుంటే రూ. 12 లక్షల 75 వేల ఆదాయం వరకు ట్యాక్స్ చెల్లించాల్సిన అవసరం లేదు. ట్యాక్స్ స్లాబ్స్‌లో కూడా మార్పులు తీసుకువచ్చారు. కొత్త పన్ను విధానంలో ఇస్తున్న రూ.25 వేల ట్యాక్స్ రిబేట్ (రిఫండ్) ను రూ.60 వేలకు పెంచారు. గతంలో రూ.12 లక్షల ఆదాయంపై రూ.80 వేల వరకు పన్ను పడేది. రూ.12 లక్షల కంటే ఎక్కువ ఆదాయం పొందే వారికి కూడా తాజా బడ్జెట్‌లో ఉపశమనం దొరికింది. రూ.16 లక్షల ఆదాయంపై ట్యాక్స్ భారం రూ.50 వేలు తగ్గగా.. రూ.20 లక్షల ఆదాయంపై రూ.90 వేలు.. రూ.24 లక్షల ఆదాయంపై రూ.1,10,000 తగ్గింది. కొత్త పన్ను విధానాన్ని ఎన్నుకున్నవారికే ఈ ట్యాక్స్ ప్రయోజనాలు దక్కుతాయి.





**ట్యాక్స్ స్లాబ్‌లు మారాయి..**
కొత్త ట్యాక్స్ సిస్టమ్‌లో స్లాబ్‌లను కేంద్ర ప్రభుత్వం సవరించింది. గతంలో రూ.3 లక్షల వరకు బేసిక్ మినహాయింపు ఉండగా, రూ.7 లక్షల వరకు రిబేట్ (ట్యాక్స్ రిఫండ్) ఇచ్చేవారు. స్టాండర్డ్ డిడక్షన్‌ను గత బడ్జెట్‌లో రూ.50 వేల నుంచి రూ.75 వేలకు పెంచారు. తాజా బడ్జెట్‌లో బేసిక్ మినహాయింపును రూ.4 లక్షలకు, రిబేట్ లిమిట్‌ను రూ.12 లక్షలకు పెంచారు. స్టాండర్డ్ డిడక్షన్‌ను మార్చలేదు. పాత పన్ను విధానంలో మాత్రం ఎటువంటి మార్పులు చేయలేదు.

ట్యాక్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ఏప్రిల్ 1 తర్వాత ఫైల్ చేసే ఐటీ రిటర్న్‌లకు మాత్రం గతంలోని పన్ను స్లాబ్‌లే వర్తిస్తాయి. తాజాగా మారిన పన్ను స్లాబ్‌లు మాత్రం 2025-26 ఆర్థిక సంవత్సరానికి వాడుకోవచ్చు. అంటే రానున్న ఆర్థిక సంవత్సరం కోసం వచ్చే ఏడాది ఏప్రిల్ 1 తర్వాత ఫైల్ చేసే ఐటీఆర్‌లకు తాజాగా మారిన ట్యాక్స్ రేట్లు వర్తిస్తాయి.




**పాత పన్ను విధానంలో మార్పుల్లేవ్**
పాత పన్ను విధానంలో ప్రభుత్వం ఎటువంటి మార్పులు చేయలేదు. యథాతథంగా ఉంచింది. ఈ విధానంలో రూ.2.5 లక్షల వరకు బేసిక్ మినహాయింపు ఉంది. రూ.5 లక్షల ఆదాయం వరకు ట్యాక్స్ రిబేట్ పొందొచ్చు. 80సీ, 80 డీ వంటి సెక్షన్ల కింద మినహాయింపులు పొందొచ్చు.

**ధరలు తగ్గేవి ..**
క్యాన్సర్, ఇతర వ్యాధుల మందులు
ఎలక్ట్రిక్ వెహికల్స్, ఎలక్ట్రానిక్స్ ఐటమ్స్
ఇంపోర్టెడ్ కార్లు, బైక్స్
మొబైల్ ఫోన్లు, హెడ్ ఫోన్స్
ఎల్‌సీడీ, ఎల్‌ఈడీ టీవీలు
ఫ్రోజెన్ చేపలు, చేపల పేస్ట్,సముద్ర ఉత్పత్తులు
లెదర్ ఉత్పత్తులు

**ధరలు పెరిగేవి..**
స్మార్ట్ మీటర్లు, సోలార్ సెల్స్
ఫ్లాట్ ప్యానెల్ డిస్‌ప్లేలు (టీవీలు)
ఉలెన్ దుస్తులు, ఇంపోర్టెడ్ చెప్పులు
పీవీసీ (పాలీవినైల్ క్లోరైడ్) ఉత్పత్తులు



## పాత పన్ను విధానంలోని స్లాబ్‌లు

| ఆదాయం (రూ.ల్లో) | పన్ను రేటు |
|---|---|
| రూ.2.5 లక్షల వరకు | జీరో |
| 2,50 లక్షల నుంచి 5 లక్షలు | 5% |
| 5 లక్షల నుంచి 10 లక్షలు | 20% |

## కొత్త పన్ను విధానంలో ట్యాక్స్ స్లాబ్‌లు

| ప్రస్తుతం (రూ.ల్లో) | పన్ను రేటు | ఇకపై (రూ.ల్లో) | |
|---|---|---|---|
| 3 లక్షల వరకు | జీరో | 4 లక్షల వరకు | జీరో |
| 3 లక్షల నుంచి 7 లక్షలు | 5 శాతం | 4 లక్షల నుంచి 8 లక్షలు | 5శాతం |
| 7 లక్షల నుంచి10 లక్షలు | 10 శాతం | 8 నుంచి 12 లక్షలు | 10 శాతం |
| 10 లక్షల నుంచి 12 లక్షలు | 15 శాతం | 12లక్షల నుంచి 16 లక్షలు | 15 శాతం |
| 12లక్షల నుంచి 15 లక్షలు | 20 శాతం | 16 లక్షల నుంచి 20 లక్షలు | 20 శాతం |
| 15 లక్షల పైన | 30 శాతం | 20లక్షల నుంచి 24 లక్షలు | 25 శాతం |
| 24 లక్షల పైన | 30 శాతం | | |






# కొండగట్టు అంజన్నకు డీజీపీ పూజలు

### పూర్ణకుంభంతో స్వాగతం పలికిన అర్చకులు


**కలంజ్యోతి, జగిత్యాల/ మల్యాల :** జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టులో ుటుంబ సమేతంగా ఆంజనేయస్వామిని తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్ దర్శించుకున్నారు. డీజీపీ కి ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు వేదోక్త మంత్రాలతో ఆశీర్వదించి స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాలు అందజేశారు. ముందుగా కొండగట్టుకు విచ్చేసిన డీజీపీని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేశారు. అనంతరం సాయిద బలగాలతో గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా డీజీపీ జిల్లా స్థితిగతులు, శాంతి భద్రతల గురించి జిల్లా పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యల గురించి ఎస్పీని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రఘు చందర్, ఆర్ఐ కిరణ్ కుమార్, మల్యాల సీఐ రవి, ఎస్సైలు సతీష్, రవికుమార్ ఉన్నారు.





# రైతులను ప్రోత్సహించాలి

## కలెక్టర్ కుమార్ దీపక్



**కలంజ్యోతి, మంచిర్యాల :** జిల్లాలో రైతులు వ్యవసాయ సాగులో ఆర్థికంగా లబ్ధి పొందేలా ప్రత్యామ్నాయ, వాణిజ్య పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించి, ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని చెప్పారు. సాధారణ పంటలు మాత్రమే కాకుండా ప్రత్యామ్నాయంగా వాణిజ్య పంటలు, కూరగాయల సాగుపై రైతులను ప్రోత్సహించాలని సూచించారు. పాడి రైతులు పౌల్ట్రీ, గొర్రెల పెంపకం, చేపల పెంపకం పై దృష్టి సారించాలని తెలిపారు. అధిక ఆదాయాన్ని అందించే ఆయిల్ పామ్, పండ్ల తోటల పెంపకంపై ప్రభుత్వం ప్రత్యేక అవకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో 3 వేల ఎకరాల ఆయిల్ పామ్ తోటల సాగు లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. 5 ఎకరాల కంటే తక్కువ భూమి విస్తీర్ణం గల రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరించాలని, ప్రతి రోజు 5 నుండి 10 మంది రైతులకు లాభదాయక మార్గాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కల్పన, ఉద్యానవన శాఖ అధికారి అనిత, జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి శంకర్, మండల వ్యవసాయ, విస్తరణా అధికారులు, పశువైద్య శాఖ అధికారులు, ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులతో పాటు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## బేటీ బచావో–బేటీ పడావోపై అవగాహన

**కలంజ్యోతి, నిర్మల్ :** సమాజంలో స్త్రీలపై పెరిగిపోతున్న వేధింపుల నేపథ్యంలో నిర్మల్ సోఫినగర్ కేజీబీవిలో విద్యార్థులకు బాల్య వివాహాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాలల హక్కులు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం ప్రారంభించి పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న 45 రోజుల కార్యక్రమాల్లో భాగంగా బాలశక్తి కార్యక్రమంలో వారిని భాగస్వాములు చేశారు. విద్యార్థినులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాల్యవివాహాలు, బాల్య వివాహ నిర్మూలన చట్టం 2006, వివిధ హెల్ప్ లైన్ నెంబర్లు 100, 1098 ,181, 1930, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులంతా అన్ని అంశాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపిఓ మురళి, జిసిడిఓ సలోమి కరుణ ,కేజీబీవీ ఎస్ఓ సుజాత, మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్ట్ జ్యోతి, మౌనిక లు, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

### రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**కలంజ్యోతి, మంచిర్యాల :** ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుల స్థానానికి ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని తెలిపారు. ఎన్నికలు జరిగే జిల్లాల వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ శాసన మండలి సభ్యుల ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సమీక్షలో అధికారులు యాదయ్య, వెంకటేశ్వర్ రావు, సంతోష్ కుమార్, సత్యం పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు గుండు సున్నా



## మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి

**కలంజ్యోతి, జగిత్యాల :** కేంద్ర బడ్జెట్ ల్లో తూర్పు రాష్ట్రాలకు వెళ్లిందని, దక్షిణాది రాష్ట్రాల వైపు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ కన్నెత్తి చూడలేదని జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి అన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం బడ్జెట్ లో తెలంగాణ ప్రభుత్వంపై పక్షపాత దోరణి చూపుతుందని ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలోని ఒక్క ప్రాజెక్టులకు బడ్జెట్ లో కేటాయింపులు లేవని ఆరోపించారు. రాష్ట్రానికి బడ్జెట్ లో నిధులు కేటాయించకపోతే రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందుతుందని నిలదీశారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారని, తెలంగాణ ప్రజలకు బీజేపీ ఎంపీలు సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఈ బడ్జెట్ లో గుండు సున్నా ఇచ్చిందని తీవ్ర అన్యాయానికి గురవడమే కాకుండా అభివృద్ధి తిరోగమన దిశగా వెళుతుందన్నారు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతున్నదని, కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సంపన్న వర్గాల వారికే మేలు చేస్తుందని జ్యోతి విమర్శించారు.

# ఎమ్మెల్యేల భేటీపై సీఎం ఆరా!


**కలంజ్యోతి, హైదరాబాద్ :**

అధికార పార్టీలో అలజడి రేగింది. కాంగ్రెస్ కు చెందిన పది మంది ఎమ్మెల్యేలు శనివారం ఉదయం నగర శివారులోని ఓ హోటల్ లో ఓ మంత్రికి వ్యతిరేకంగా రహస్యంగా సమావేశం కావడం సంచలనం రేపింది. వీరందరూ రాష్ట్ర కేబినెట్ లో ఓ మంత్రి ఆగడాలు, బాసిజం, ఆధిపత్య ధోరణికి వ్యతిరేకంగా సమావేశం అయినట్లు అధికార పార్టీలోనే చర్చ జరుగుతున్నది. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్ లో అత్యవసర సమావేశాన్ని నిర్వహించడం రాష్ట్ర రాజకీయాలను మరింత హీటెక్కించింది. మరోవైపు అధికారులను ఈ సమావేశానికి రావొద్దని సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇందులో పార్టీలో జరుగుతున్న కీలక పరిమాణలపై చర్చించనున్నట్లు తెలుస్తుంది. అయితే కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు మాత్రం.. ఇది కేవలం ప్రభుత్వ పాలనపై, మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరు పై నిర్వహించే రివ్యూ మీటింగ్ లాంటిదని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుకు తీసుకోవాల్సిన చర్యలను సీఎంతో పాటు మంత్రులు నిర్ణయాలు తీసుకోవడానికి సమావేశం ఏర్పాటు చేశారని చెబుతున్నారు.



# నిరూపిస్తేనే నమ్మేది

**న్యూ ఢిల్లీ :**



ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. కులం పేరుతో దూషించాడని నిరూపించేందుకు నిందితుడు ప్రజాక్షేత్రంలో బహిరంగంగా బాధితుడిని దూషించినట్లుగా నిరూపించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు అందుకు సంబంధించి నమోదైన ఓ కేసును శనివారం కొట్టివేస్తూ తీర్పు చెప్పింది. 1989లోని సెక్షన్ 3(1)(ఆర్) కింద నేరం రుజువు కావాలంటే ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందిన వ్యక్తిని నిందితుడు ఉద్దేశపూర్వకంగా ప్రజా సమక్షంలో బహిరంగంగా అవమానించినట్లు కానీ, బెదిరించినట్లు కానీ నిరూపించాల్సి ఉంటుందని అత్యున్నత ధర్మాసనం స్పష్టం చేసింది. రక్షణ కోసం తెచ్చిన ఈ చట్టాన్ని కొందరు దుర్వినియోగం చేస్తున్నారని కోర్టు మండిపడింది. ఓ కేసులో దళితుడిని దూషించిన ఘటన నాలుగు గోడల మధ్య జరిగింది. ఆ తర్వాత ఫిర్యాదుదారుడి సహచరులు ఘటనా స్థలానికి చేరుకున్నారని ఎఫ్ఐఆర్‌లో పోలీసులు వెల్లడించాడన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. కేసుకు కారణమైన ఘటన అందరూ చూస్తుండగా బహిరంగ ప్రదేశంలో జరగలేదని పేర్కొన్న జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌తో కూడిన ధర్మాసనం కేసును కొట్టివేసింది. అట్రాసిటీ చట్టంలోని సెక్షన్ 3(1) (ఎస్) కింద నేరం రుజువు కావాలంటే ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందిన వ్యక్తిని బహిరంగ ప్రదేశంలో కులం పేరుతో దూషించి ఉండాలని స్పష్టం చేసింది.

## స్వాతంత్ర్య సమరయోధురాలు మృతి



**కలంజ్యోతి, నర్సంపేట :** నర్సంపేట పట్టణాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు కీసరి ముత్తమ్మ (100) శనివారం మృతి చెందారు. స్థానికుల వివరాల మేరకు నర్సంపేట పట్టణానికి చెందిన కీసరి ముత్తయ్య స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. ఆయన భార్య ముత్తమ్మ ఆ పోరాటానికి ఆయనతో వెన్నద న్నుగా నిలిచింది. కాగా, అప్పటి ప్రభుత్వం వారి పోరాటాన్ని గుర్తించి స్వాతంత్ర్య పోరాట యోధులుగా గుర్తించింది. కాగా, ముత్తయ్య 15 సంవత్సరాల క్రితం గుండెపోటు రాగా మృతి చెందారు. గత 20 రోజులుగా ముత్తమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న శనివారం తుదిశ్వాస విడిచారు. ఆమెకు ఇద్దరు కుమారులు కీసరి వెంకటేశ్వర్లు (బాబు), కీసరి నరేందర్ ఉన్నారు.

## కేసీఆర్ ను కలిసిన వనరిగారి శ్రీకాంత్



**కలంజ్యోతి, హత్నూర :** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ను నర్సాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ యువనాయకుడు వనరిగారి శ్రీకాంత్ కలిసి శుభా కాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పరిచి ఎంతో ఆదర్శంగా నిలపడానికి మాజీ సీఎం కేసీఆర్ కృషి చేయడం హర్షనీయమన్నారు. కేసీఆర్ నాయకత్వం మళ్లీ పూర్వ వైభవం సాధించాలని లక్ష్యంతో పార్టీ పటిష్టతకు తనవంతు కృషి చేయనున్నట్లు తెలిపారు.

## బడ్జెట్లో తెలంగాణకు మొండి చేయి

### కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎండీ అజీజ్



**కలంజ్యోతి, నర్సాపూర్ :** పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో తెలంగాణను మరోసారి విస్మరించారని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ అజీజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ట్రిపుల్ ఐటీ, నవోదయ సైనిక్ స్కూల్స్ ఇవ్వాలని ఎప్పటినుంచో బడ్జెట్లో వాటిని ప్రస్తావిస్తానని చెప్పి వాటి విషయంలో ఎలాంటి ప్రస్తావని లేకపోవడం చాలా బాధాకరమన్నారు. తెలంగాణలో బీజేపీ నుంచి 8 మంది పార్లమెంట్ సభ్యులు ఉన్నా.. రాష్ట్రానికి మాత్రం ఏ ఒక్క అభివృద్ధి చేయని ఘనత వారికే దక్కుతుందన్నారు. పదేళ్లుగా దేశంలో ప్రధాని మోదీ పేద మధ్య తరగతి ప్రజలను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు.

## బీసీ గర్జన విజయవంతం చేద్దాం

### పులి దేవేందర్

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** 'హలో బీసీ చలో వరంగల్'నినాదంతో ఆదివారం హన్మకొండలోని ఆర్ట్స్ కళాశా ల మైదానంలో నిర్వహించనున్న 'బీసీ యుద్ధభేరి సభ'ను విజయవం తం చేయాలని బీసీ ప్రజల ఐక్యత అభివృద్ధి హక్కుల కోసం సభను విజ యవంతం చేయాలని మెప్మా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ కోరారు. శనివారం సభ ప్రాంగణంలో బీసీ రాష్ట్ర నాయకుల సమక్షంలో హలో బీసీ చలో వరంగల్ అని నినాదంతో ఎత్తు ఎత్తర జెండా 'బీసీ జెండా' అని సబ్బండ బీసీ కులాల ఐక్యత కోసం వారి కుల వృత్తుల నేపథ్యంలో పాట పాడి అందరిని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సహకార గానం అందించిన మెప్మా రాష్ట్ర నాయకులు పల్లెబోయిన అశోక్, నాయకులు పొన్నం రాజు, నెరటి రాజు, సింగారపు రామకృష్ణ, దండు చిరంజీవి, అమ్మవారి శ్యామ్ ,వినోద్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



## కుంభమేళాలో తప్పిపోయిన జిల్లా వాసుల ఆచూకీ లభ్యం

### జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**కలంజ్యోతి, జగిత్యాల :** కుంభమేళాలో తప్పిపోయిన జిల్లా వాసుల 4 గురు మహిళల ఆచూకీ లభ్యమైందనీ సురక్షితంగా వారి ఇళ్లకు చేరారని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్రాజ్ లో జరుగుతున్న మహా కుంభమేళలో పాల్గొనడానికి జగిత్యాల జిల్లాకు చెందిన 11 మంది మహిళలు ఈ నెల 27న ఒక ప్రైవేట్ ట్రావెల్ బస్సులో బయలుదేరారు. 29వ తేదీ సాయంత్రం వారు ప్రయాగ్రాజ్ లోని సంఘం ఘాట్ వద్దకు చేరుకున్నారు. గంగానదిలో పుణ్యస్నానం చేయడానికి రెండు గ్రూపులుగా విడిపోయి వెళ్ళగా, ఈ క్రమంలో ఏనుగుల బుచ్చవ్వ, మరో ముగ్గురు మహిళలు బెల్లపు సత్తవ్వ, వీర్ల నరసవ్వ, ఆది రాజవ్వ జనసందోహంలో తప్పిపోయారు. జిల్లాకు చెందిన 4 గురు మహిళలు తప్పిపోయిన విషయాన్ని తెలుసుకున్న ఎస్పీ వెంటనే తప్పిపోయిన మహిళల వివరాలు తెలుసుకొని ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్రాజ్ పోలీస్ వారి సహాయంతో తప్పిపోయిన నలుగురి మహిళల యొక్క ఆచూకీ తెలుసుకొని వారిని సురక్షితంగా జగిత్యాలకు తీసుకువచ్చారు. ఈసందర్భంగా ప్రత్యేక చొరవ తీసుకొని తప్పిపోయిన మహిళలను సురక్షితంగా తీసుకురావడంలో కృషి చేసిన జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మెట్పల్లి డీఎస్పీ రాములుకు తప్పిపోయిన మహిళల కుటుంబాల సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## వాహనం నుంచి జారిపడి చిన్నారి మృతి

### శోక సంద్రంలో తల్లిదండ్రులు

**కలంజ్యోతి, జగిత్యాల :** టాటా ఏస్ వాహనం నుంచి జారిపడి చిన్నారి మృతి చెందిన ఘటన జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన రవీందర్ లత దంపతుల కుమార్తె స్పందన(6) చిల్వకోడూరు ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతుంది. అయితే ఎప్పటిలాగే పాఠశాలకు టాటా ఏస్ వాహనంలో బయలుదేరింది. స్కూలుకు వెళుతుండగా మార్గమధ్యంలో గోవిందుపల్లి మూలమలుపు వద్ద టాటా ఏస్ డోర్ కదలడంతో ప్రమాదవశాత్తు కింద పడింది. కిందపడిన చిన్నారి స్పందన తీవ్ర గాయాల పాలవగా చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. స్కూలుకు వెళ్లిన చిన్నారి విగత జీవితం మారడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు.

## మైసమ్మ జాతరను ఘనంగా నిర్వహించాలి

**కలంజ్యోతి, మంచిర్యాల :** జిల్లాలోని మందమర్రి మండలం బొక్కలగుట్ట ప్రాంతంలో ఈనెల 14వ తేదీ నుండి జరిగే గాంధారి ఖిల్లా మైసమ్మ జాతరను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని తన ఛాంబర్ లో జాతర కమిటీ ప్రతినిధులతో కలిసి జాతర గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 14, 15, 16 తేదీలలో జరిగే మైసమ్మ జాతరను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. జాతరకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రత్యేక బందోబస్తుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయక్ పోడ్ హక్కుల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు పెద్ది భార్గవ్ పటేల్, గంజి రాజన్న, ఆదివాసీ నాయకులు, సాంస్కృతిక కళాభివృద్ధి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మేస్నేని రాజన్న, మనుమతుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సగర సంఘ సేవలు అభినందనీయం

### నేత్ర వైద్యుడు గుండేటి గణేష్

**రెడ్డిపల్లిలో సగర సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం**



**కలంజ్యోతి, హన్మకొండ :** సగర సంఘం సేవలు అభినందనీయమని హన్మకొండ పట్టణానికి చెందిన ప్రముఖ నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ గుండే టి గణేష్ అన్నారు. సగర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ట రాజు కోరిక మేరకు మండలంలోని రెడ్డిపల్లి గ్రా మంలోని సగర సంఘ కార్యాలయంలో సగర సంఘం నేతృత్వంలో హన్మకొండలోని గణేష్ ఐ కేర్ అండ్ ఆప్టికల్స్, సాయితేజ చారిటబుల్ ట్రస్టు ఆ ధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్య క్షుడు దేవునూరి శ్రీనివాస్ సగర, ప్రధాన కార్యదర్శి కట్ట రాజు సగర, కోశాధికారి కాటిపెల్లి కుమార స్వామి (బాబు), సగర సంఘం గ్రామ కమిటీ ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ ఆధ్వర్యంలో గ్రామంలోని సగర కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు 60 మంది కంటి పరీక్షలు నిర్వహించి మాట్లాడారు. కంటి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిం చారు. పలువురికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తిం చారు. వారికి ఉచితంగా హైదరాబాద్ లో ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాగా వీరికి ఉచిత రవాణాతో పాటు భోజన సదుపాయం కల్పించనున్న ట్లు తెలిపారు. ఈసందర్భంగా నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ గ్రామానికి మొదటిసారి రాగా వారిని సత్కరించారు. కార్యక్రమంలో సగర సంఘం రెడ్డిపల్లి, శ్రీరాముల పేట గ్రామ శాఖల అధ్యక్షులు కట్ట శ్రీనివాస్ సగర, దేవునూరి రాజేందర్ సగర, రెడ్డిపల్లి గౌరవ అధ్యక్షుడు కట్ట మల్లేష్ సగర, రాష్ట్ర సగర సంఘం మహిళా విభాగం కార్యవర్గసభ్యురాలు కుర్మిండ్ల జ్యోతి సగర, గ్రామ కమిటీ సభ్యులు కట్ట అశోక్, కట్ట నవీన్, కట్ట శ్రీనివాస్, కట్ట కుమార్, కట్ట శ్రీధర్, కుర్మిండ్ల సదయ్య, కుర్మిండ్ల స్వామి, కుర్మిండ్ల జనార్దన్, కుర్మిండ్ల నాగరాజు, లద్దూ, కుర్మిండ్ల శేఖర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కలంజ్యోతి
ఆదివారం 02.02.2025
Cinema




## న్యూ జనరేషన్‌లో స్వయం పాలన

**విద్యార్థులకు పాఠశాల చైర్మన్ జానకీ రాంరెడ్డి దిశానిర్దేశం**

**కలంజ్యోతి, నల్గొండ :** జిల్లా కేంద్రానికి చెందిన న్యూ జనరేషన్ పాఠశాలలో స్వయం పాలన దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. విద్యార్థులే ఉపాధ్యాయులు అయిన వేళ పాఠశాల కొత్త వన్నెలు సంతరించుకుని ఆ ప్రాంగణమంతా కళకళలాడింది. నిత్యం విద్యా బోధనతో పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు తోటి విద్యార్థులకు విద్యను బోధించి ఆనందించారు. ఈ సందర్భంగా న్యూ జనరేషన్ చైర్మన్ జానకీ రాంరెడ్డి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం జానకీ రాంరెడ్డి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అలక జానకీరాంరెడ్డి, స్కూల్ ఇంఛార్జీ శ్వేత, ఉపాధ్యాయునులు మేరీ, పుష్పలత, చైతన్య, సునీత, స్వప్న, రేణుక, లిఖిత, విజయలక్ష్మి, షగుఫ్తా, అఫ్సా, విద్యార్థులు పాల్గొన్నారు.




# బస్తీల అభివృద్ధికి పెద్దపీట

**రోడ్లు, డ్రైనేజీ పనులను ప్రారంభించిన కొలన్ హన్మంత్ రెడ్డి**





**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** మిథిల నగర్ ఆర్.కే లేఔట్ లోని విష్ణు ప్రియ ఎనక్లేవ్ లో సీసీ రోడ్, డ్రైనేజీ పూర్తిగా ధ్వంసంకావడంతో బస్తీవాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను బస్తీ వాసులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన మంత్రి శ్రీధర్ బాబు స్పెషల్ ఫండ్స్ ద్వారా సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.12లక్షలు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.63లక్షలు మంజూరు చేయించారు. ఆయా పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొలను హన్మంత్ రెడ్డి బస్తీ వాసులు సత్కరించి, ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి, సిద్దనోళ్ల సంజీవరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలను రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఎండి లాయక్, ఖాజా, అజయ్, హరికృష్ణారెడ్డి, సంతోష్, అనిల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

WANTED విలేఖరులు కావలెను




'కలంజ్యోతి' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రిబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది. ప్రజలకు, ప్రభుత్వానికి, నాయకులకి మధ్య సమాచార వారధిగా, ప్రజా సమస్యల పరిష్కార దిశగా, పాఠకుల దిక్సూచిగా 'కలంజ్యోతి' పాఠకుల మన్ననలను పొందుతున్నది. మరింత నాణ్యమైన వార్త సమాచారాన్ని, వార్త ప్రపంచాన్ని విస్తరించడానికి ప్రజలకు అందించాలనే సంకల్పంతో నియోజకవర్గ, మండలాల వారీగా కంట్రిబ్యూటర్లు నియమించుకోవాలని భావిస్తున్నాము.

సెల్ : 9494 009 003

## మహా ప్రదర్శనతో ప్రభుత్వం దిగి రావాలి

**కొలెపాక వెంకట్ మాదిగ**

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ నెల 7లో ఎల్బీ స్టేడియం వద్ద జరిగే లక్ష డప్పులు వేల గొంతుకల ప్రదర్శన లో మాదిగలు వర్గీకరణకు అనుకూలంగా ఉన్న యావత్ ప్రజానీకంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చేలా దిగ్విజయం చేయాలని మాదిగ జర్నలిస్ట్ ఫోరం ప్రతినిధులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం జగద్గిరిగుట్ట లాస్ట్ బస్ స్టాప్ వద్ద మాదిగ జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో డప్పుల ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ ఎంజేఎఫ్ నాయకులు కొలెపాక వెంకట్ మాదిగ ప్రదర్శనకు తరలి వెళ్లేందుకు తన వంతుగా 10 డప్పులను బహుకరించారు. కార్యక్రమంలో మహాజన వర్కింగ్ జర్నలిస్ట్ ఫోరం డప్పు రామస్వామి, ఎంజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల బాబు, జాతీయ నాయకులు ముక్కర్ల లాలయ్య, కొలెపాక వెంకట్, మేడ్చల్ జిల్లా కన్వీనర్, జోగు వెంకట్, కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు పి.గణేష్, నాగేశ్వర్ రావు, శ్రీశైలం, రాగల ఆనంద్, డి.రమేష్, రవీందర్, స్వామి, ఎమ్మార్పీఎస్ నాయకులు దేశపాక లింగయ్య, బి.యాదగిరి,అల్వాల భాస్కర్, డి.మల్లేష్, అనిల్ చెవిటి వెంకన్న పాల్గొన్నారు.

